ప్రజాశక్తి
బుధవారం 26 జూన్ 2024
5
విజయనగరం



కలెక్టర్‌ను సత్కరించిన మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరం కోట

బదిలీపై వెళుతున్న కలెక్టర్ నాగ లక్ష్మిని మంగళవారం రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దుశ్శాలువతో సత్కరించారు. ఆమెకు పూలగుచ్చం అందించి అభినంద నలు తెలిపారు. జిల్లాలో సమర్ధవంతమైన సేవలు అందించారని కొనియాడారు.



బదిలీపై వెళ్తున్న కలెక్టర్ నాగలక్ష్మిని అభినందిస్తున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కలెక్టర్ అంబేద్కర్ బాధ్యతలు స్వీకరణ

స్వాగతం పలికిన అధికారులు ● జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ చేరుకున్న ఆయనకు జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి తమ వంతు కషి చేస్తానని, అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన నడిపిస్తానని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళతామని అన్నారు. గతంలో తాను జిల్లాలో వివిధ హోదాల్లో పని చేసానని, జిల్లా పరిస్థితులపై కొంతవరకు అవగాహన ఉందని కలెక్టర్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌కు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్.డి.అనిత, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, వివిధ శాఖల అధికారులు, అసోసియేషన్ల ప్రతినిధులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

నేడు సీజనల్ వ్యాధులపై కలెక్టర్ సమీక్ష

సీజనల్ వ్యాధులపై కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బుధవారం ఉదయం 11గంటలకు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. వైద్యారోగ్య శాఖ, పంచాయతీ, తాగునీటి సరఫరా తదితర శాఖల అధికారులు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.



కలెక్టర్ అంబేదర్కర్‌కు స్వాగతం పలుకుతున్న జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ, ఆర్‌డిఒ



ఎస్.కోటలో బలజమయమైన రహదారి

వర్షం..హర్షం

ప్రజాశక్తి-శృంగవరపుకోట, బొబ్బిలి

జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శృంగవరపుకోట మండలం లో సుమారు గంటపాటు కురిసిన భారీ వర్షంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. శ్రీనివాస కాలనీలో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించి సాయిబాబా గుడి వద్ద విశాఖ అరకు రహదారికి ఆనుకొని గల కంచేటి కోనేరులో చేరడంతో ఇప్పటికే పూడికపోయి ఉన్న కోనేరులోకి వెళ్లిన నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్ ఎదురుగా గల విశాఖ అరకు రహదారిలో కాలువలను ఆక్రమించి వ్యాపార సముదా యాలు నిర్మించడంతో భారీ వర్షానికి నీరు నిలిచి మోకాల్లోతు ప్రవహించడంతో అప్పుడే స్కూల్లు విడిచిపెట్టిన విద్యార్థులు, వాహనచోధకులు ఇబ్బందులకు గుర య్యారు. వర్షాకాలంలో పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

బొబ్బిలి : గ్రోత్ సెంటర్ పరిసర గ్రామీణ ప్రాంతాల్లో వర్షం కురవడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షం కురిసినప్పటికి పట్టణంలో వర్షం లేదు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంతంలో చిరుజల్లులు కురిసినప్పటికి రైల్వే జంక్షన్ దాటి వర్షం లేదు. దీంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గొర్లెసీతారాంపురం, మెట్టవలస, పారాది ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో పంట పొలాల్లో వరదనీరు చేరి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఉన్న స్థానాల్లో కొనసాగేందుకు కొందరు యత్నం
- జిల్లాకు వచ్చేందుకు పాతవారు ప్రయత్నం
- వైసిపి ముద్రపడిన అధికారుల్లో ఆందోళన
- అమాత్యుని అపాయింట్‌మెంట్ల కోసం ఎదురు చూపులు



అందరినోటా బదిలీల మాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా, మండలస్థాయి అధికారులందరి నోటా బదిలీల మాట వినిపిస్తోంది. జిల్లాలోని కొంతమంది అధికారులు యథాతథ స్థానాల్లో కొనసాగేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి, ప్రస్తుతం ఇతర జిల్లాల్లో ఉన్న అధికారులు కొంతమంది తిరిగి యుటర్న్ తీసుకునేందుకు సిద్ధమౌతున్నారు. గత ఐదేళ్లలో వైసిపి నాయకుల వద్ద స్వామి భక్తి ప్రదర్శించినవారిలో మాత్రం బెంగ మొదలైంది. ముఖ్యంగా జిల్లా అధికారులెవరికీ ఇప్పటి వరకు ఎలాంటి హామీలూ దక్కలేదు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి నిన్నమొన్నటి వరకు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం.

ప్రభుత్వం మారినప్పుడు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు మొదలుకుని జిల్లా, మండల స్థాయి అధికారుల వరకు బదిలీలు సర్వ సాధారణం. ఈ క్రమంలో ఉద్యోగులు తమకు అనుకూలమైన శాఖల్లోకి, ప్రాంతాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం బదిలీపై గుంటూరు వెళ్లారు. ఆమె స్థానంలో నూతన కలెక్టర్‌గా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజుల్లో ఎస్పికూడా బదిలీ అవుతారనే ప్రచారం జరుగుతోంది. ఇక జిల్లా అధికారులైతే ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచే తాము కోరుకున్న ప్రాంతానికి లేదా శాఖలకు వెళ్లేందుకు, ఉన్న స్థానంలో యథాతథంగా కొనసాగేందుకు తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు, వారి తరపున నాయకులు గత కొద్దిరోజులుగా మంత్రులను, ఎమ్మెల్యేలను, ఎంపీలను కలుస్తున్నారు. ముఖ్యంగా మంత్రులిద్దరూ పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే శాసన సభ సమావేశాలు ప్రారంభం కావడం, ఆ తరువాత మంత్రివర్గ సమావేశంలో పాల్గొనడంతో జిల్లాకు రావడం ఆలస్యమైంది. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీనివాస్ సోమవారం జిల్లాకు వచ్చారు. ఈనేపథ్యంలో అధికారులంతా మంత్రిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు మంత్రి శ్రీనివాస్‌ని కలిసిన కొంతమంది అధికారులు తమకు ఎలాంటి హామీ రాలేదని చెబుతుండగా, కొంతమంది ఎలా స్పందిస్తారో అంటూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తమ మనసులో మాట చెప్పుకునేందుకు మంత్రి ప్రత్యేకమైన అపాయింట్‌మెంట్లు ఇవ్వాల్సివుంది. అపాయింట్‌మెంట్లన్నీ గుంపులో గోవిందలా ఉంటే మనసు విప్పిమాట్లాడే పరిస్థితి దక్కదని అధికారులు చర్చించు కుంటున్నారు. ఇందుకు మంత్రి కొంత సమయం కేటాయించకపోతే అధికారులు ఇబ్బందులు పడడంతోపాటు షోకాల్డ్ అధికారులు, దిగువ స్థాయి నాయకులు పైరవీలకు తెరలేపే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఒక అధికారి తనకు అత్యంత సన్నిహితంగా ఉండే మరో దిగువ స్థాయి అధికారిని వెంటబెట్టుకుని ఏకంగా జిల్లా కలెక్టర్ (ఎస్.నాగలక్ష్మి)తో ఒక కీలకశాఖ పోస్టింగ్ కోసం పైరవీలు చేసేందుకు ప్రయత్నించినట్టు తెలిసింది. అయితే కలెక్టర్ సున్నితంగా తిరస్కరించారట. కొందరు నాయకులు కూడా అధికారులకు హామీలు ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బదిలీల వ్యవహారం విషయంలో మంత్రి స్పీడ్ గేర్ మార్చాల్సివుందని చర్చనడుస్తోంది. మరోవైపు గజపతినగరం నియోజకవర్గంలో మండల స్థాయి పోస్టుల కోసం ప్రయత్నిస్తున్న అధికారులు కూడా మంత్రి ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్నారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దు

కమిషనర్ ఎంఎం నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలకు అసౌకర్యం కలిగించే ఏ చర్యలనైనా ఉపేక్షించవద్దని ప్రణాళిక కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రకటన బోర్డులు, ఇతరత్రా పన్నులు రాబట్టడంలో ఉదాసీనంగా వ్యవహరించిన కార్యదర్శులు పట్ల అసహనం వ్యక్తం చేశారు. నగరంలో వివిధ ప్రాంతాలలో భవన వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రణాళిక కార్యదర్శులు క్షేత్ర పర్యటనలు చేస్తూ వ్యర్థాల తొలగింపునకు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణా చర్యలు చేపట్టామని, కొన్నిచోట్ల మరమ్మతులకు గుర్రైనట్లు గమనించామన్నారు. వాటిని కూడా తక్షణమే పరిరక్షించే చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మధుసూదనరావు, అమ్మాజీ రావు, సర్వేయర్ సింహాచలం, టి పి ఎస్ ఫిలిప్, ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎంఎం నాయుడు

వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

నగరంలో వీధి దీపాల సక్రమ నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయుడు ఆదేశించారు. ఐడిఎస్ఎంటి కాంప్లెక్స్ కార్యాలయంలో వీధి దీపాల పరికరాల పరిస్థితిని గమనించారు. ప్రజలు, కార్పొరేటర్ల నుండి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా తగిన సామాగ్రి సిద్ధంగా ఉందా లేదా అని సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. విద్యుత్ దీపాలు మరమ్మత్తులకు గురైతే తక్షణమే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రజల నుంచి గాని, స్థానిక కార్పొరేటర్ నుంచి గాని వీధి దీపాలు వెలగలేదని ఫిర్యాదు వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరించి వారితో సంతకాలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న, ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరగాలని అందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఇఒలు కృషి చేయాలని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ కోరారు. మంగళవారం ఓ ప్రైవేటు స్కూల్లో మండల విద్యా శాఖ అధికారులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. విద్యా ప్రమాణాల మెరుగుదలకు హెచ్‌ఎంలు కృషి చేయాలన్నారు. విద్యార్థులు అకడమిక్ స్థాయి పెరుగుదలలో ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యత వహించాలని సూచించారు. విద్యా ప్రమాణాలు పెరుగుదలకు ప్రతి ఒక్కరూ కృషి చేసి మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు.

విద్యార్థులం దరికీ పుస్తకాలు, విద్యార్థి కిట్లు అందించాల న్నారు. డ్రాపౌట్ విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాల న్నారు. సమావేశంలో డిఇఒ ప్రేమ్ కుమార్, డిప్యూటీ డిఇఒలు కె.వెంకటరమణ, కె.మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ అధికారిని నియమించండి


విజయనగరం టౌన్ : జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా గిరిజన సంక్షేమ సాధికారత అధికారిని నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణపొంది రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు కొత్తవారిని నియమించలేదని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి మాతృసంస్థకు చెందిన రెగ్యులర్ గిరిజన సంక్షేమ సాధికారత అధికారిని నియమించాలని కోరారు.

జ్యూట్‌మిల్లు మళ్లీ మూత

రోడ్డున పడ్డ కార్మికులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ మిల్ అకారణంగా మూత బడింది. నెలలో రెండు వారాలు పనిచేస్తే మరో రెండు వారాలు ఇష్టానుసారం మూసివేసి కార్మికులను యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోంది. సుమారు 2వేల మంది పర్మినెంట్, కాంట్రాక్టు (పొడికూలి) కార్మికులు ఇక్కడ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ముడి సరుకు కొరత పేరిట యాజమాన్యం జ్యూట్ మిల్లును అక్రమంగా మూసి వేసి కార్మిక కుటుంబాల కడుపు కొడుతుందని ఆయా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలో రెండు మూడు సార్లు మిల్లు మూతబడడంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గత కొన్నేళ్లుగా జ్యూట్ యాజమాన్యం తాము చెప్పిందే వేదంగా మిల్లును నడుపుతూ ఇఎస్ఐ, పిఎఫ్ వంటి కంట్రీబ్యూషన్ ప్రభుత్వానికి చెల్లించకుండా నిర్లక్ష్యం వహించినా సరే కార్మికులు ఓపికతో పని చేస్తున్నారు. అయితే ముడిసరుకు కొరత కారణంగా మిల్లును మూసివేసినట్లు యాజమాన్యం చెబుతోంది. గత కొన్నేళ్లుగా ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిల చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం చేయడంతో మిల్లులో పనిచేస్తున్న కార్మికులు, రిటైర్డు కార్మికులు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు పొంద లేకపోతున్నారు. 2016 నుంచి గ్రాడ్యూటి బకాయిలు కూడా జ్యూట్ యాజమాన్యం చెల్లించలేదు సరికదా చెక్కులు ఇచ్చినప్పటికీ ఖాతాలో నగదు లేక పోవడం అవి చెల్లకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుతమైనా జ్యూట్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.





డిప్యూటీ డిఇఒ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సురేష్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

డిప్యూటీ డిఇఒ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

పాఠ్య పుస్తకాలపై స్కూల్ పేరు ముద్రించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు అమ్మి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న సురేష్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము డిమాండ్ చేశారు. అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్న సురేష్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం డిప్యూటీ డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్నా, విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అమ్మకాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులపై యాజమాన్య ప్రతినిధులు అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. పుస్తకాలు అమ్ముతున్న గది వద్దకు ఎంఇఒ చేరుకున్నప్పటికి యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించడం సమంజసం కాదని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో విద్యాశాఖాధికారులు కుమ్మక్కై వారి దోపిడీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, యాజమాన్యానికి సహకరిస్తున్న డిప్యూటీ డిఇఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు మణికుమార్, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం నగరంలోని ఎస్ఎస్-ఎస్ఎస్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల విచక్షణ కోల్పోయి, మత్తులో హింసాత్మక సంఘటనలకు పాల్పడి, క్రిమినల్ కేసుల్లో నిందితులుగా మారే అవకాశం ఉందన్నారు. మత్తు పదార్థాల అలవాటు పడితే భవిష్యత్తు నాశనమేనని అన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేసేందుకు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని, శ్రద్ధగా చదివి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. భవిష్యత్తు నాశనం చేసే మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సిఐ వెంకటరావు విద్యార్థులు, యువతకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై హరిబాబు నాయుడు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మురిపించే కథలు' ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంతకవిటి మండలం బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు రాసిన 'మురిపించే కథలు' పుస్తకాన్ని డిఇఒ ప్రేమ్‌కుమార్, డిసిఇబి కార్యదర్శి సన్యాసిరాజు మంగళవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆవిష్కరించారు. మహాత్మగాంధీ జీవితంలోని కొన్ని ఘట్టాలను ఇంగ్లీషు, తెలుగులో కథల రూపంలో పొందుపర్చడం అభినందనీయమని అన్నారు.ఈ సందర్భంగా హెచ్‌ఎంలకు, ఎంఇఒలకు ఈ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆపస్ పూర్వ సమన్వయ కర్త దూబ సూరపునాయుడు, బొత్స వెంకటరావు, మజ్జి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభలో ప్రమాణస్వీకారం చేసి విజయనగరం చేరుకున్న అనంతరం మంగళవారం ఆమెకు నియోజకవర్గ జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు కలిసి మొక్కలు, పుస్తకాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. పలుశాఖల అధికారులు వచ్చి మర్యాదపూర్వకంగా కలిచారు. ఆర్‌టిసి ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సిఐ బి.ఆదినారాయణ ఆమెకు పుష్పగుచ్చం అందజేశారు. బుధవారం నూతన బస్సుల ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యేకు పలువురు ఈ సందర్భంగా సమస్యలపై వినతులు ఇచ్చారు.

పరిధి దాటి వైద్యం చేయొద్దు

ప్రముఖ వైద్యులు డాక్టర్ చిట్టి రమణారావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైద్య వృత్తి ఎంతో ప్రధానమైనదని, అటువంటి వైద్య వృత్తికి వన్నె తెచ్చేలా ఆర్ఎంపి వైద్యులు వ్యవహరించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ చిట్టి రమణారావు అన్నారు. మనిషి ప్రాణాలు ఎంతో విలువైనవని, ఆర్ఎంపి వైద్యులు పరిధి వైద్యం చేయవద్దని సూచించారు. విజయనగరం సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశం, వైద్య అవగాహన సదస్సు మంగళవారం ముడిదాం ఎస్-కన్వెన్షన్ హాల్లో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చిట్టి రమణారావు వైద్య విధానాలపై ఆర్ఎంపిలకు పలు సూచనలు చేశారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ ఆర్ఎంపి వైద్యం ప్రాథమికంగా ఎంతో కీలకమని అన్నారు. గ్రామీణ వైద్యులుగా గుర్తింపు పొందిన ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించ బడాలంటే రాష్ట్రవ్యాప్తంగా ఆర్ఎంపిలంతా ఏకతాటిపై పోరాడితే సాధ్యపడుతుందని అన్నారు. ఆర్ఎంపి వైద్యులకు గుర్తింపునిచ్చే 429 జీవో అమలు జరగాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎంపిలు సంఘటితమై సమిష్టి పోరాటం చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు విల్లూరి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఏ అనారోగ్య సమస్య వచ్చిన ప్రాథమికంగా చికిత్స అందించేది ఆర్ఎంపిలే అయినప్పటికీ, స్థాయికి మించి వైద్యం అందించవద్దని విజ్ఞప్తి చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి సత్తిరు రాజశేఖర్ మాట్లాడుతూ ఆర్ఎంపి వైద్యులు ప్రజలకు నమ్మకం కలిగే విధంగా వైద్యం అందించాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎఎస్ శర్మ మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్ఎంపిలు రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మరింత మంచి సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇప్పలవలస గోపి, అధ్యక్షుడు పి.కనకాచారి మాట్లాడుతూ హరిజన, గిరిజన గ్రామాలతో పాటు మురికివాడల లో నివసించే ప్రజల ప్రాణాలను ప్రాథమికంగా కాపాడేది ఆర్ఎంపి వైద్యులేనని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు కనకాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటరమణ ఆసుపత్రి క్రిటికల్ కేర్ ఇన్‌ఛార్జి డాక్టర్ రెడ్డి మహేష్, జిల్లా కోశాధికారి వై.సోమేశ్వరి, ఆర్ఎంపి వైద్యులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వెంకటరామా ఆస్పత్రి అధినేత డాక్టర్ చిట్టి రమణారావు

కూలీలందరికీ పని కల్పించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

ఉపాధి హామీ కూలీలందరికీ పని కల్పించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కంటకాపల్లి ఉపాధి కూలీలు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఉపాధి పనులను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే సరియైన కూలీ రాక, చాలీచాలని కూలితో ఉపాధి కూలీలు రెండు పూటలా పనిచేస్తున్నారని అన్నారు. అయినప్పటికీ కూడా చాలీచాలని వేతనాలు వేస్తున్నారన్నారు. ఒక పూటే పని పెట్టాలని, పాత పద్ధతిలోనే 200 రోజులు పని కల్పించి 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని పథకాన్ని పకడ్బందీగా అమలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి
www.prajasakti.com



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పాఠశాలలను పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం కృషి చేద్దామని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం' ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పిద్దాం నినాదంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. బడి అంటే అందరిదీ అనే భావనతో వెళ్ళాలనే లక్ష్యంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని తల్లిదండ్రులకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, బొబ్బిలి మండలం, పట్టణం ప్రధాన కార్యదర్శులు బత్తుల శ్రీనివాస్, రాధాకృష్ణ, మండలం అధ్యక్షులు మహేష్, సహాధ్యక్షులు అప్పలనాయుడు, జిల్లా నాయకులు సత్యన్నారాయణ, రెడ్డి రాంబాబు, మండల నాయకులు అనంత్, కృష్ణ దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని శానిటేషన్ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. పట్టణంలోని చీపురుపల్లివీధి, వెలమవారివీధిలో పారిశుధ్య పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. రోడ్లు, కాలువలలో చెత్త వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. వెలమవారివీధిలో ప్రైవేట్ స్థలంలో ఉన్న కల్వర్టు కూలడంతో వర్షం కురిస్తే నీరు సక్రమంగా వెళ్లకపోవడంతో స్థలం యజమానికి నోటీసులు జారీ చేయాలని కోరారు. పైపులైన్ వాల్వులు వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలకు రూ.25 వేలు వితరణ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర పాఠశాల సహాయకురాలుగా పనిచేస్తున్న వివిఎస్ సుధారాణి అదే పాఠశాలకు తన వేతనం నుంచి రూ.25 వేలు వితరణ అందజేసి ఉదారత చాటుకున్నారు. ఈ మేరకు హెచ్ఎం రావాడ భాస్కరరావు మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్(మైక్ సెట్) కొనుగోలు నిమిత్తం ఈ నగదు అందించారన్నారు. ఇది పాఠశాలకు ఎంతో ఉపయోగకరమని పాఠశాల అసెంబ్లీ, పాఠశాలలో జరిగే ఇతర కార్యక్రమాలకు మైక్ సెట్ లేకపోవడంతో ఆ ఇబ్బందిని గమనించి మైక్ సెట్ కొనుగోలు నిమిత్తం ఈ మొత్తాన్ని వినియోగించాలని ఆమె కోరారన్నారు. విరాళాన్ని అందించిన సుధారాణిని పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మండల రమేష్ నాయుడు అభినందనలు తెలిపారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన గిరడ

ప్రజాశక్తి- బొబ్బిలి

జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి కలిశారు. పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీరించిన సందర్భంగా మంగళగిరి జనసేన కార్యాలయంలో పవన్ కళ్యాణ్‌ను కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గ సమస్యలను పవన్ కళ్యాణ్‌కు వివరించినట్లు అప్పలస్వామి చెప్పారు.

గ్రామాల్లో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం, బొద్దాం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల పాఠశాలల్లో మంగళవారం విస్తృతంగా నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను అరికట్టాలని ర్యాలీ

ప్రజాశక్తి- మెంటాడ

మండల కేంద్రంలో మంగళవారం ఆంధ్ర ఎస్ఐ ఉద్భవ దేవి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలను అరికట్టాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల యువత ఆరోగ్యంతోపాటు భవిష్యత్తు అంధకారంలోకి వెళుతుందన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు గుర్తించి అవగాహన కల్పించాలి. వీటిని అరికట్టే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. మెంటాడ సినిమా హాలు నుంచి హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర పోలీసు సిబ్బంది, ఐవి రమణ, పలు గ్రామాలకు చెందిన యువకులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్లలో రోటరీ క్లబ్ తాగునీటి సేవలు ప్రారంభించింది. మంగళవారం స్థానిక మిమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఇస్కాన్ స్థలంలో విజయనగరం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణశాంతి ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను మాతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదచారులు, వాహనదారులకు దాహార్తి తీర్చడానికి తాగునీటి సేవలు అందిస్తామన్నారు. డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎం.పద్మకుమారి, మేఘరాజ్ రాటీ, భగవాన్, రొటేరియన్స్ పాల్గొన్నారు.

చేయూత డబ్బులివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

నాల్గో విడత చేయూత డబ్బులు ఎన్నికల ముందు హడావిడిగా వైసిపి ప్రభుత్వం బటన్ నొక్కి ఇప్పటి వరకూ వేయలేదని వెంటనే ఆ డబ్బులను మహిళల ఖాతాల్లో వేయాలని మంగళవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు ఆధ్వర్యంలో మహిళలు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బటన్ నొక్కిన తరువాత ఎన్నికల కోడ్ రావడంతో కొందరికి డబ్బులు పడి కొందరికి పడక మహిళలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచార సందర్భంగా సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని అందులో భాగంగా చేయూత డబ్బులు వెంటనే రాని వారికి వాళ్ల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ రవి కుమార్‌కు వినతి పత్రం అందించారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, మహిళలు

వందరోజులు పని కల్పించాలి

మండలంలోని రంగరాయపురం గ్రామంలో ఉపాధి హామీ పని వంద రోజులు ప్రభుత్వం ప్రకటించిన ఆ గ్రామంలో 100 రోజులు పని ఇవ్వకుండా ఆపేశారని ప్రభుత్వం ప్రకటించిన వేతనం కూడా అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఎపిఒ కలగజేసుకొని ప్రభుత్వం ప్రకటించిన పనిదినాలతో పాటు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎపిఒ బుధవారం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలా కానీ ఎడల గురువారం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగరాయపురం కార్యదర్శి ఉడముల ప్రసాదు మహిళలు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై విచారణ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - జామి

జామిలో నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్ వ్యవహారాలపై మైన్స్ విజిలెన్స్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. సోమవారం 'మైనింగ్ దోపిడీ' అన్న శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మైన్స్ విజిలెన్స్, భూగర్భజల శాఖ అధికారులు విచారణ చేపట్టారు. పత్రికల్లో వార్తలు రావడంతో పాటు స్థానికుల ఫిర్యాదలు మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మైనింగ్ నిర్వహిస్తే, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుదారు లతో పాటు అధికారులు పాల్గొన్నారు.



మైనిగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కార్పొరేట్ల మైనింగ్ వైపు చూడని అధికారులు

భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి లక్షల టన్నుల రాతి మెటీరియల్‌ను అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపణలు నేపథ్యంలో అధికారులు వారి వంక చూడడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కార్పొరేట్ సంస్థలు చేస్తున్న అక్రమ మైనింగ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టిడిపితో రైతులకు న్యాయం

ప్రజాశక్తి - గుర్ల

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని టిడిపితో రైతులకు పూర్తి న్యాయం జరుగుతోందని టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి అన్నారు. మంగళవారం పాలవసలో రైతులకు వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం అభివృద్ధి చెందాలన్నా, రైతు సుభిక్షంగా ఉండాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సాధ్యమన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో వైసిపి ప్రభుత్వంలో సామాన్య రైతుకు విత్తనాలు కావాలంటే క్యూ లైన్ లలో నిలబడి సమయాన్ని వృధా చేసుకునే వారని, బ్లాక్ మార్కెట్లో కూడా కొనే దౌర్భాగ్య పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు భిన్నంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. జిల్లా టిడిపి బీసీ సెల్ కార్యదర్శి తాడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రైతులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పన టిడిపితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుంకరి పైడి నాయుడు, టిడిపి గ్రామ అధ్యక్షులు వల్లూరు బంగారు నాయుడు, నాయకులు గేదెల అప్పలనాయుడు, సుంకరి ఉపేంద్ర, వల్లూరు భాస్కరరావు, వల్లూరు పైడితల్లి, సుంకరి రమణ, ఇజ్జిరోతు బంగారు నాయుడు, కోట లక్ష్మ నాయుడు, సుంకరి శ్రీనివాసరావు, గేదెల సత్యం, రాజారావు, నారాయణరావు, గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: విత్తనాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

చల్లవానితోటలో విత్తనాలు పంపిణీ

పూసపాటిరేగ: మండలంలోని చల్లవానితోట రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ పతివాడ వరలక్ష్మి, ఎంపిటిసి ఎం.మానస చేతులు మీదుగా రైతులుకు మంగళవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడూతూ రైతులకు సకాలంలో విత్తనాలు అందించడమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం ముందుకు వెల్లడం సంతోషంగా ఉందన్నారు. సరియైన సమయంలో విత్తనాలు అందించడంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. కూరగాయలు పండించే రైతులు సేంద్రియ సాగువైపు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ పతివాడ శ్రీను, విఎఎ పి. ప్రయాంక, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

బాడంగి: మండలంలోని రేజేరు రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలకు సూడోమోనస్‌తో విత్తనశుద్ధి కార్యక్రమం మీద రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసి వరి విత్తనాలు వేసుకోవడం వల్ల వరి పంటలో వచ్చే అగ్గి తెగులు, పాము పొడ, కుళ్ళ తెగుళ్ల నుండి ముందస్తు రక్షణ ఉంటుందన్నారు. విత్తనశుద్ధికి అవకాశం లేని ఎడల నారు తీసే సమయంలో నారు కట్టలు సూడోమోనస్ ద్రావణంలో ముంచి నారు శుద్ధి కూడా చేసుకోవచ్చు అని తెలిపారు. సూడోమోనస్ తోనే కాకుండా ఒక కిలో వరి విత్తనాలకి మూడు గ్రాములు కార్బన్‌డిజం అనే మందుతో విత్తన శుద్ధి చేసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి

సాగునీటి ప్రాజెక్టులపై మంత్రితో ఎమ్మెల్యే చర్చ

ప్రజాశక్తి - భోగాపురం

సాగునీటి ప్రాజెక్టులపై ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో ఎమ్మెల్యే లోకం మాధవి మంగళవారం అమరావతి సచివాలయంలో కలిసి చర్చించారు. ఆయన మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు గురించి వివరించారు. తోటపల్లి కాలువ దుస్థితి, చంపావతి గోస్థని నదుల అనుసంధానం వివిధ సాగునీటి ప్రాజెక్టుల గురించి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వీటిని అందుబాటులోకి తీసుకువస్తే తాగునీటి సమస్య కూడా తీరుతుందని ఆమె వివరించారు. దీనిపై ఆయన కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో విద్యార్థులు పడుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సామాజిక వేత్త రిక్కి అప్పారావు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. వేపాడ పంచాయతీ పరిధిలోగల బక్కునాయుడుపేట కస్తూరిబా బాలికల వసతి గృహంలో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకూ ఒక్కొక్క తరగతికి పది సీట్లు చొప్పున పెంచాలని కోరారు. మండల కేంద్రానికి విశాఖపట్నం ద్వారకా నగర్ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కొత్తవలస మీదుగా సోంపురం జంక్షన్ వయా సింగరాయి జంక్షన్ మీదుగా ఆర్‌టిసి బస్సును ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌కోట ఆర్‌టిసి డిపో నుంచి జాకేరు, దబ్బిరాజుపేట మీదుగా ఆదర్శ పాఠశాలకు బడి బస్సు వేయాలని, సింగరాయ కోమట చెరువు నుంచి ఆతవ ప్రధాన రోడ్డునకు, ఆతవ నుంచి బానాదికి రోడ్డుతో పాటు గెడ్డ వద్ద వంతెన నిర్మించాలన్నారు. వెంటనే స్పందించిన మంత్రి 15 రోజుల్లోగా ఈ పనులన్నీ పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు అప్పారావు తెలిపారు. రెండు వారాల్లోగా పనులు పూర్తి కాకపోతే వెంటనే మంత్రి తనకు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని చెప్పినట్లు వెల్లడించారు.



మంత్రి లోకేష్‌తో అప్పారావు

ధర్మవరం పాఠశాలలో మాక్ పోలింగ్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ ద్వారా పాఠశాల విద్యార్థి నాయకుడిని, ఉప నాయకుడిని ఎన్నుకున్నట్లు ఆ పాఠశాల ఇంచార్జి హెచ్ఎం ఎస్ శివరామకృష్ణ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆర్‌విఎస్‌యన్ మూర్తి, వి.ఈ సత్యనారాయణ, రమేష్‌నాయుడు, పొట్నూరు శ్రీరాములు, రహీమ్ షేక్ లాల్ ఆధ్వర్యంలో సాధారణ ఎన్నికలలో సభ్యులను ఎన్నుకోవడం ఎలా జరుగుతుందో అలాగే విద్యార్థి నాయకుడు, ఉప నాయకుడు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ, ఉపసంహారణ ప్రక్రియ, ఎన్నికల ప్రచారం, ఓటింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ, విద్యార్థి నాయకుడు ఉప నాయకుడు ఎన్నికల ప్రకటన వరకూ అన్ని విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఈ మాక్ పోలింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ఎన్నికలలో బి.నవ్యకు 23ఓట్లు, బి యోగికి 60 ఓట్లు, సిహెచ్ జగదీష్‌కు 18ఓట్లు, కె పల్లవికు 43ఓట్లు, యల్ శిరికి 16 ఓట్లు, పెద్దింటి రాజేష్‌కు 70 ఓట్లు, పి సాయిరాజ్‌కు 2ఓట్లు, రాడి సన్యాసిరావుకు 75 ఓట్లు వచ్చినట్లు తెలిపారు. పోటీ చేసిన వారిలో రాడి సన్యాసిరావు 75 ఓట్లతో విద్యార్థి నాయకుడుగా, పెద్దింటి రాజేష్ 70 ఓట్లతో విద్యార్థి ఉప నాయకుడుగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ రహీమ్ షేక్ లాల్, ఈశ్వరరావు, ఎన్నికల అధికారులుగా ఐయన్ఎం మూర్తి, శోభారాణి, జయలక్ష్మి, శివాజీ, శ్రావణి, లావణ్య, సకీనా బి, ఎస్‌విఎస్‌యన్ మూర్తి, ఏవి స్వామి, హరి, యల్‌వి సత్యనారాయణ, పాపారావు, సూర్యకుమారి తదితరులు వ్యవహారించారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి

ప్రజాశక్తి- విజయనగరం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపైన, హెల్త్ కార్డులు, ఫీజు రాయితీలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు అవనాపు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు మానాపురం రవిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం విజయనగరంలో మంత్రికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీఆర్ గోపాల్ వర్మ, ఉపాధ్యక్షులు అల్లా రమణ, గౌరవ సలహాదారు వాడాడ గౌరీ శంకర్, జాయింట్ సెక్రెటరీ అరుణ్ కుమార్, హేమంత్ కుమార్, కార్యవర్గ సభ్యుడు బుగత శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మంత్రికి వినతి పత్రాన్నిస్తున్న జర్నలిస్టులు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- గుర్ల

అవినీతి, అక్రమాలకు పాల్పడి సస్పెండ్‌కు గురై తిరిగి విధుల్లోకి చేరిన పాలవలస ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గేదెల సత్యనారాయణపై సమగ్ర విచారణ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి అక్రమాలు చేశాడని కూలీలు 24 తేదీన కలెక్టరేట్ గ్రీవెన్స్ వద్ద ఆందోళన చేపట్టి వినతినిచ్చిన విషయం తెలిసిందే.ఈనేపథ్యంలో ఆయన మంగళవారం పాలవలస వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. గతంలో ఈయనపై అనేక ఆరోపణలు రావడం, అధికారులు కూడా చర్యలు తీసుకున్నారని ఈ నేపథ్యంలో సస్పెండ్ కూడా అయ్యాడని చెప్పారు. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ కోర్టుకు వెళ్లి కేసు గెలవడంతో మరలా విధుల్లోకి వచ్చా డని అటువంటి మోసపూరిత వ్యక్తిని విధుల్లోకి తీసుకుంటే మళ్లీ మోసపోతామని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కూలీలు పనిలోకి వెళ్లడం లేదని, జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకోపోతే కూలీలు వేతన దినాలను కోల్పోయే ప్రమాదం ఉందని శ్రీనివాస్ అన్నారు. వెంటనే దర్యాప్తు చేపట్టాలని కోరారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపిపి అనూష

ప్రజాశక్తి - భోగాపురం

వర్షాకాలంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లేదంటే డయేరియా, డెంగీ వంటి వ్యాధులు పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇ వైకుంఠంనాయుడు మాట్లాడుతూ తాగునీటి విషయంలో ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పరీక్షలు చేస్తామన్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని తెలిపారు. ఎంపిడిఒ చంద్రకళ మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య లోపం ఎక్కడైనా ఉంటే దానిపై వెంటనే దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఇఒపిఆర్‌డి సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భోగాపురం : మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు నారాయణరావు (55) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. నారాయణరావు నిత్యం మద్యం సేవిస్తుండడంతో భార్య తరచూ మందలించేది. దీంతో ఈనెల 21న మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరం పెద్దాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు.

కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం కోట

పట్టణంలోని డక్కిన వీధిలో రాజస్థాన్‌కు చెందిన భగవాన్ రాం నివాసం ఉంటూ, వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ నెల 14న రాజస్థాన్‌కు చెందిన బిజిలారామ్, మరి కొంత మంది భగవాన్ రాం నివాసం ఉండే ప్రాంతానికి వచ్చి, అతడితో మాట్లాడి, కారులో ఎక్కించుకుని తమ ఆడవారికి అసభ్యకర సందేశాలు పంపుతున్నారనే నెపంతో భగవాన్ రాంను తీవ్రంగా కొట్టి రూ.35వేలు దోచుకున్నట్లు సిఐ వెంకటరావు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దేవాసి వజీరామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE JUDICIAL 1st CLASS MEGISTRATE CHEEPURUPALLI CC 34/2023

Between :
Routu Bangari Naidu S/o late Ramulu
....Petitioner/Complant
And :
Amara Sri Ramu @ Koteswara Rao, S/o late Ramu Murthy, Hindu, R/o Penubarthi (Village & Post), Gurla (MD), Vizianagaram Dist. ......Respondent/Accused

GENERAL NOTICE

Please take notice that the above Complaint filed U/s 138 & 142 of NI Act. (cheque Bowns Case) Against you for Recovery of Cheeque Amount also on Appilation, U/o XXXIX (39, Rule-V(3) Vide CC 34/2023 that the Honourable Court Several Times Issues Summons to you. But you want only Escaped from the Service of the Same.

That the above CC 34/2023 and posted for Hearing at **10-30 AM 28-06-2024** Before said Court and if you want to contest the matter you may do so either in person or by a duly Instructed pleader and if you fails to so cause matter will be decided by the Honourable court.

By order of the Honourable Court

G.Prakash Rao
Cell: 9849556671
M.Lakshmana Rao
Advocates, Cheepurupalli,
Cell : 9490678925

గ్రామపంచాయతీ కార్యాలయం - పురిటిపెంట

వేలం మరియు టెండరు ప్రకటన

రేఖా నెం :29/2024 తే. 24-06-2024 ది

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామ పంచాయతీ కి చెందిన ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు 1 ప్రాప్తి కి 2024-25 సంవత్సరమునకు రోజు వారి మార్కెట్ ఆశీలు వేలం ద్వారా గుత్త కిచ్చుటకు తే. 29 -06-2024 ది శనివారం ఉదయం 10.00 గంటల నుండి 1 గంట వరకు టెండర్లు స్వీకరించి మద్యాహ్నం 3 గంటలకు పురిటిపెంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీ విస్తరణాధికారి EOPR&RD వారి సమక్షములో సర్పంచ్ శ్రీమతి సొంట్యాన విజయలక్ష్మి వారి అధ్యక్షతన బహిరంగ వేలం జరుపబడును రెండింటి లో ఏది ఎక్కువ వస్తే ఆ పాటను కాయ పరుచబడును, మరియు షెడ్యూలు 2 ప్రాప్తికి అదే రోజు ఉదయం 11 గంటలకు ఈ దిగువ ఉదహరించిన వాటికి షీల్డ్ టెండర్లు స్వీకరించబడి అదే రోజు మద్యాహ్నం 2 గంటలకు హాజరు అయిన టెండరు దారులు సమక్షములో సదరు టెండర్లు తెరువబడును, వేలాం పాటలో పాలుగున్న వారు మరియు షీల్డ్ టెండర్లు వేయగోరు వారు ఈ పంచాయతీ షరతులకు లోబడి షెడ్యూలు లో చూపిన ప్రకారం చెల్లించవలసిన ధరావత్తులు ముందుగా చెల్లించి ధరావత్తులు రశీదు తో పాటు షీల్డ్ టెండర్లు ధాకలు చేయవలెను ధరావత్తులు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. వేలం పాటలో పాల్గొన్న దలచిన వారు 1,00,000/-లు (అక్షరములా ఒక లక్ష రూపాయలు) ఆస్థి విలువగల ధ్రువపత్రం (సాల్వెన్సీ సర్టిఫికేట్) దాఖలు చేయవలెను. మిగిలిన వివరములు ఈ కార్యాలయం పని వేలలలో స్వయముగా వచ్చి తెలుసుకొనగలరు.

1. టెండరు కమ్ వేలం పాట

వరుస నెం.	వివరములు	సంవత్సరము	ధరావత్తు
1	రోజు వారి మార్కెట్ ఆశీలు వసూళ్లకు గుత్త హక్కునకు 2024-25 సంవత్సరమునకు (01-07-2024 ది నుండి 31-03-2025ది వరకు, 09 నెలలు	2024-25 (09 నెలలు)	రూ.25000/-లు

2. టెండరులు

వరుస నెం.	వివరములు	సంవత్సరము	ధరావత్తు
1	కాంట్రాక్ట్ పద్ధతి పై పారిశుధ్య పనులు నిర్వహించుటకు 14 మందిని సప్లయ్ చేయుటకు	2024-25	10000/-
2	కాంట్రాక్ట్ పద్ధతి పై PWS స్కీములు ఆపరేట్ చేయుటకు 4 మందిని సప్లయ్ చేయుటకు	2024-25	2000/-
3	కాంట్రాక్ట్ పద్ధతి పై వీధి లైట్లు రిపేర్ చేసి పోల్లు ఎక్కించుటకు 1 సప్లయ్ చేయుటకు	2024-25	500/-
4	పంచాయతీ ఆటోలు మరియు ట్రాక్టర్ నిర్వహణకు డ్రైవర్స్ 2 సప్లయ్ చేయుటకు	2024-25	1000/-

గమనిక :- 1} ఈ గ్రామపంచాయతీ కాంట్రాక్టు పనులు నిర్వహించు వారు శ్రీ కలెక్టర్ (పంచాయతీ విభాగం) వారి లోబడి టెండర్లు ధాకలు చేయబడును. 2) కాంట్రాక్టరు కాంట్రాక్ట్ లేబరుకు రెండు జతల బట్టలు, చెప్పులు, సబ్బులు మరియు కొబ్బరి నూనె సరఫరా బాద్యత వహించి టెండరు ధాకలు చేయవలెను 3) టెండరు ధారు కాంట్రాక్టు లేబరుకు బీమా మరియు PF చేయించవలెను.

శ్రీమతి సొంట్యాన విజయలక్ష్మి
సర్పంచ్, గ్రామపంచాయతీ
పురిటిపెంట

జి.జనార్ధనరావు
పంచాయతీ కార్యదర్శి
పురిటిపెంట

గ్రామపంచాయతీ కార్యాలయం - గజపతినగరం

బహిరంగ వేలం మరియు టెండరు ప్రకటన

రేఖా నెం :24/2024 తే. 24-06-2024 ది

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం గజపతినగరం పంచాయతీకి చెందిన ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు 1 ప్రాప్తి కి 2024-25 సంవత్సరమునకు రోజు వారి మార్కెట్ ఆశీలు వేలం ద్వారా గుత్త కిచ్చుటకు తే. 28 -06-2024 ది శుక్రవారం ఉదయం 10.00 గంటల నుండి 1 గంట వరకు టెండర్లు స్వీకరించి మద్యాహ్నం 3 గంటలకు గజపతినగరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శ్రీ విస్తరణాధికారి EOPR&RD వారి సమక్షములో సర్పంచ్ శ్రీమతి నరవ కొండమ్మ వారి అధ్యక్షతన బహిరంగ వేలం జరుపబడును రెండింటి లో ఏది ఎక్కువ వస్తే ఆ పాటను కాయపరుచబడును, మరియు షెడ్యూలు 2 ప్రాప్తికి అదే రోజు ఉదయం 11 గంటలకు ఈ దిగువ ఉదహరించిన వాటికి షీల్డ్ టెండర్లు స్వీకరించబడి అదే రోజు మద్యాహ్నం 2 గంటలకు హాజరు అయిన టెండరు దారులు సమక్షములో సదరు టెండర్లు తెరువబడును, వేలాం పాటలో పాలుగున్న వారు మరియు షీల్డ్ టెండర్లు వేయగోరు వారు ఈ పంచాయతీ షరతులకు లోబడి షెడ్యూలు లో చూపిన ప్రకారం చెల్లించవలసిన ధరావత్తులు ముందుగా చెల్లించి ధరావత్తులు రశీదు తో పాటు షీల్డ్ టెండర్లు ధాకలు చేయవలెను ధరావత్తులు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. వేలం పాటలో పాల్గొన్న దలచిన వారు 1,00,000/-లు (అక్షరములా ఒక లక్ష రూపాయలు) ఆస్థి విలువగల ధ్రువపత్రం (సాల్వెన్సీ సర్టిఫికేట్) దాఖలు చేయవలెను. మిగిలిన వివరములు ఈ కార్యాలయం పని వేలలలో స్వయముగా వచ్చి తెలుసుకొనగలరు.

1. టెండరు కమ్ వేలం పాట

వరుస నెం.	వివరములు	సంవత్సరము	ధరావత్తు
1	రోజు వారి మార్కెట్ ఆశీలు వసూళ్లకు గుత్త హక్కునకు 2024-25 సంవత్సరమునకు (01-07-2024 ది నుండి 31-03-2025ది వరకు, 09 నెలలు	2024-25 (09 నెలలు)	రూ.25000/-లు

2. టెండరులు

వరుస నెం.	వివరములు	సంవత్సరము	ధరావత్తు
1	కాంట్రాక్ట్ పద్ధతి పై పారిశుధ్య పనులు నిర్వహించుటకు 14 మందిని సప్లయ్ చేయుటకు	2024-25	10000/-
2	కాంట్రాక్ట్ పద్ధతి పై PWS స్కీములు ఆపరేట్ చేయుటకు 3 మందిని సప్లయ్ చేయుటకు	2024-25	2000/-
3	కాంట్రాక్ట్ పద్ధతి పై వీధి లైట్లు రిపేర్ చేసి పోల్లు ఎక్కించుటకు 1 సప్లయ్ చేయుటకు	2024-25	500/-
4	పంచాయతీ ఆటోలు మరియు ట్రాక్టర్ నిర్వహణకు డ్రైవర్స్ 1 సప్లయ్ చేయుటకు	2024-25	500/-

గమనిక :- 1} ఈ గ్రామపంచాయతీ కాంట్రాక్టు పనులు నిర్వహించు వారు శ్రీ కలెక్టర్ (పంచాయతీ విభాగం) వారి లోబడి టెండర్లు ధాకలు చేయబడును. 2) కాంట్రాక్టరు కాంట్రాక్ట్ లేబరుకు రెండు జతల బట్టలు, చెప్పులు, సబ్బులు మరియు కొబ్బరి నూనె సరఫరా బాద్యత వహించి టెండరు ధాకలు చేయవలెను 3) టెండరు ధారు కాంట్రాక్టు లేబరుకు బీమా మరియు PF చేయించవలెను.

శ్రీమతి నరవ కొండమ్మ
సర్పంచ్, గ్రామపంచాయతీ
గజపతినగరం

యం.రమణ
పంచాయతీ కార్యదర్శి
గజపతినగరం